
10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్


గురువారం | 30 జనవరి 2025 | పేజీలు 8



గాగిల్లాపూర్‌లో బీఆర్ఎస్ నేత అక్రమ నిర్మాణం.. స్టేజ్-1..



గాగిల్లాపూర్ బీఆర్ఎస్ నేత అక్రమ నిర్మాణం.. స్టేజ్-2..




గాగిల్లాపూర్ బీఆర్ఎస్ నేత అక్రమ కట్టడం..స్టేజ్-3

- దుండిగల్ మున్సిపాలిటీపై మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ నిర్లక్ష్యం..
- కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణతో టిపిఎస్ సంజునా తోడై అక్రమ కట్టడాలతో దోపిడీ..?
- చర్యల ఊసే లేకపోయినా.. మున్సిపాలిటీకి ఓ ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనం ఖరీదుపై విమర్శలు..
- ప్రశ్నించినా..! పత్రికల్లో వచ్చినా..! ఉత్సవ విగ్రహం లా వ్యవహరిస్తున్న కమిషనర్..
- గాగిల్లాపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకుని అక్రమ నిర్మాణం..100 గజాల్లో పేకమేడలా 4 అంతస్తులు..
- బౌరంపేట్‌లో 100 ఫీట్ల రోడ్డులో "రెసిడెన్షియల్ పర్మిషన్" ఇచ్చిన "కమిషనర్-టిపిఎస్"
- ఎస్ఆర్‌కే గేటు పక్కనే అక్రమ సెల్లార్‌తో కమర్షియల్ నిర్మాణం చేపడుతున్న బిల్డర్..
- బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో రెసిడెన్షియల్ పర్మిషన్‌తో కమర్షియల్ నిర్మాణం..
- సెట్‌బ్యాకులో వాచ్‌మెన్ రూము నిర్మాణం, అయినా కమిషనర్ కల్వకుంట్ల ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ..
- ముడుపులు చెల్లిస్తే అక్రమ నిర్మాణ దారులకు బరితెగించి సహకరిస్తున్న అధికారులు..
- దుండిగల్ మున్సిపాలిటీలో "సింగిల్ విండో" అనుమతులతో అధికారుల అక్రమార్జన..
- దుండిగల్ మున్సిపాలిటీని "ఏలుతున్న" కమిషనర్-టిపిఎస్..

## అక్రమ కట్టడాలకు సూత్రదారులే..!

# "కమిషనర్-టిపిఎస్"..?

### ముడుపులు పుచ్చుకుని బరితెగించి సహకరిస్తున్న కమిషనర్ కల్వకుంట్ల, టిపిఎస్ సంజునా..?

అక్రమ నిర్మాణాలతో "స్థానికంగా ఉన్న అధికారులు వసూళ్ళకు పాల్పడుతూ"..? ఉన్నతాధికారులకు వాటాలు అందజేస్తున్నారని..? అందుకే దుండిగల్ మున్సిపాలిటీలో చర్యల ఊసే ఉండదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. దుండిగల్ మున్సిపల్ ఏర్పాటు అధికారుల కరెప్షన్‌కి, ప్రభుత్వం చేయూతను స్తుందని ఎద్దేవా చేసేవారు లేకపోలేదు.. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే..? దుండిగల్ మున్సిపల్ కమిషనర్ మాజీ ముఖ్యమంత్రికి బంధువు అయినందునే, కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ నాలుగు రాళ్ళు వెనుకేసుకోవడానికి..! బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే దుండిగల్‌ల్లో పోస్టింగ్ ఇచ్చినట్లు సమాచారం.. అందుకే కమిషనర్ సారు ఎవరిని లెక్కచేయరని, ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తూ..! ప్రమాదకర అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.. ఇక టౌన్‌ప్లానింగ్ అధికారి సంజున, కరీంనగర్ జిల్లాకు చెందిన నేతల పలుకుబడి ఉందని, గతంలో టిపిఎస్‌ను ప్రశ్నించిన, కొందరు దుండిగల్ ప్రాంత నేతలకు ఫోన్‌లు చేయించినట్లు సమాచారం.. ఇద్దరు హేమాహేమీలుగా ఉన్న మున్సిపాలిటీలో తిరుగులేని అధికారులని ఆరోపిస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 29:

-2లో




బౌరంపేట్‌లో 100 ఫీట్ల రోడ్డుకు రెసిడెన్షియల్ పర్మిషన్‌తో, కమర్షియల్ కట్టడం..

బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో, రెసిడెన్షియల్ పర్మిషన్, సెట్‌బ్యాకులో గదులు..

## చదువుతో పాటు.. వ్యక్తిత్వాన్ని పెంపొందించు కోవాలి..

- ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం వేడుకల్లో మంత్రి దుద్దిళ్ళ శ్రీదర్ బాబు..
- ఘట్‌కేసర్ మండలం ప్రతాప సింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం..
- మంత్రి శ్రీధర్ బాబు. ఎంపి ఈటల రాజేందర్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన..
- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి..

-3 లో



పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథులు..

### గోదావరి, కృష్ణా పుష్కరాలకు అందర్నీ ఆకర్షించేలా

## ప్రణాళికలు సిద్ధం చేయండి

- ఫిబ్రవరి 10 లోగా కొత్త టూరిజం పాలసీని సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- దేశ, విదేశాల పర్యాటకులను ఆకర్షించేలా అత్యుత్తమ పాలసీని తయారు చేయాలన్న సీఎం
- ఎకో, టెంపుల్ టూరిజంపై ఎక్కువగా దృష్టి సారించాలన్న రేవంత్ రెడ్డి

-3 లో



# అక్రమ కట్టడాలకు సూత్రదారులే..! "కమిషనర్-టిపిఎస్"..?



బౌరంపేట్‌లో శిఖర పాఠశాల సమీపంలో, నాలుగు అక్రమ షెడ్లు కూల్చివేసిన..ఫైల్ ఫోటో..



కూల్చివేసిన అక్రమ షెడ్లు, కమిషనర్, టిపిఎస్ సహకారంతో మళ్ళీ నిర్మాణం..



## గాగిల్లాపూర్‌లో బీఆర్ఎస్ నేత అక్రమ కట్టడం..

దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న "డ్రీమ్‌వన్" వెంచర్ కమాన్ పక్కనే నర్సాపూర్ హైవేను ఆనుకుని ఓ బీఆర్ఎస్ నాయకుడు సుమారు 100 గజాల్లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా "పార్కింగ్ ప్లస్ 4" అంతస్తులకి నాలుగేళ్ల క్రితమే పిల్లర్‌లు, స్లాబులను నిర్మించారు.. అదికూడా డ్రీమ్‌వన్‌లో ఓ అక్రమ నిర్మాణ దారుడి సౌజన్యంతో నిర్మించినట్లు సమాచారం.. ఇదిలా ఉంటే అనుమతుల్లేని ఈ అక్రమ నిర్మాణం మూడేళ్ళు గడిచిన అనంతరం..! తాజాగా కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, టౌన్‌ప్లానింగ్ అధికారి టిపిఎస్ సంజునా కనుసన్నల్లోనే శరవేగంగా పనులు చేపట్టడం విశేషం..100 గజాల్లో "పార్కింగ్ ప్లస్ 2" అంతస్తులకి మించి నిర్మించకూడదు.. కానీ రిక్టర్ స్కేల్‌పై చిన్నపాటి భూకంపాలు సంభవించినా కూలిపోయే ప్రమాదం ఉంటుంది.. బిల్డింగ్ చూస్తేనే తెలుస్తుంది.. పేకమేడలా ప్రమాదకరంగా ఉంది.. అయినప్పటికీ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునా మామూళ్ళ మత్తులో, దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు లేవంటే ఏ రేంజ్‌లో కరెప్షన్ జరుగుతోందో.. గమనించవచ్చు.. ఈ ఇద్దరు మున్సిపల్ అధికారులు ఎందుకు విధుల్లో ఉన్నారో కానీ..! పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగిన చందంగా వ్యవహరిస్తున్నారు.. అక్రమ నిర్మాణాలని ప్రోత్సహించడానికే మొగ్గు చూపుతున్నారు.. తిలాపాపం తలాపిడికెడు అన్న చందంగా తాంబూలం పుచ్చుకుని సహకరించడం మామూలేనట..

**అధికారుల అక్రమార్జన కోసమే.. టిజి-బిపాస్ చట్టంలో మార్పులు..? టిజి-బిపాస్ చట్టం కఠినమైన నిబంధనలతో రూపొందించారు..! చట్టం అమలు కూడా సక్రమమే అయినప్పటికీ..! మున్సిపల్ అధికారులకి పైసా రావడం లేదని కొందరు అవినీతి అధికారుల తెలివితేటలతో మార్పులు చేర్పులకి (చట్టాన్ని సవరించే విధంగా) తెరలేపారు.. టిజి-బిపాస్ మున్సిపల్ చట్టప్రకారం, అక్రమ నిర్మాణ దారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండ కూల్చివేయాలనే కఠినమైన నిబంధనలతో ముడుపులకు అడ్డంకి ఏర్పడటం..! అధికారులు జీర్ణించుకోలేక పోయారు.. ఏదో ఒకచోట పేరుపొందిన బిల్డర్‌తో కేసు వేయించారు.. దీంతో హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులు (కనీసం రెండు నోటీసులు ఇవ్వాలని) వారం గడువుతో ఒకటి, 15 రోజుల వ్యవధితో చర్యలకు నోటీసులు ఇవ్వాల్సిందగా చట్ట సవరణలు చేపట్టారు.. దీంతో అధికారుల లైన్ క్లియర్ అయింది.. కానీ దుండిగల్ మున్సిపాలిటీలో కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, టిపిఎస్ సంజునా పలుకుబడితో టిజి-బిపాస్ చట్టాన్ని ధిక్కరించి వ్యవహరిస్తున్నారు.. కాదని చెప్పమనండి.. పెన్ పవర్ సవాల్..**

## సింగిల్ విండోలో రెసిడెన్షియల్ పర్మిషన్‌లతో.. కమర్షియల్ నిర్మాణం..

బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో ఓ నిర్మాణ దారుడు.. సుమారు 1000 గజాల స్థలానికి, సింగిల్ విండో పర్మిషన్‌ల కింద దుండిగల్ మున్సిపల్ అధికారులు "సెల్లార్- గ్రౌండ్- 4 అంతస్తులకు" అనుమతులు మంజూరు చేశారు.. సదరు నిర్మాణ దారుడు బీఆర్ఎస్ నాయకుడు అయినందున..! సెట్‌బ్యాకుల స్థలంలో అక్రమంగా రూము నిర్మించాడు..వ్యాపార నిమిత్తం షెట్టర్‌లు నిర్మించాడు.. అయినప్పటికీ బీఆర్ఎస్ నాకునిహా కమర్షియల్ కట్టడంపై, ఎలాంటి చర్యలు తీసుకోకుండానే..! మున్సిపల్ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ ముడుపులు దండుకుని "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" సులభంగా జారీచేయడంపై మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ చర్యల్లేవు.. సెట్‌బ్యాకులు నిర్మాణం చుట్టూ 4 మీటర్‌లు (13 ఫీట్లు) వదలి నిర్మాణం చేపట్టాలి.. కానీ అధికారులకు లంచాలు ముట్టజెప్పి, సెట్‌బ్యాకు స్థలంలో వాచ్‌మెన్ రూము పేరుతో గదులు నిర్మించారు.. ఈ విషయాన్ని కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, టౌన్‌ప్లానింగ్ అధికారి టిపిఎస్ సంజునా దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం.. ముందే పలుకుబడి ఉన్న అధికారులు.. ఏదైనా సాధ్యమే..!

- మొదటి పేజీ తరువాయి

బౌరంపేట్ "ఎస్ఆర్కే" గేట్ పక్కనే.. రెసిడెన్షియల్ పర్మిషన్‌తో కమర్షియల్ కట్టడంపై ప్రశ్నిస్తే కట్టుకథలు చెబుతున్నారు.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం, కరెప్షన్‌కి బ్రాండ్ అంబాసిడర్లుగా తయారవుతున్నారు.. మున్సిపల్ పరిధి బౌరంపేట్ నుండి మల్లంపేట్ వైపు వెళ్ళే 100 ఫీట్ల రహదారిలోని "ఎస్ఆర్కే" కమాన్ పక్కనే ఓ భారీ అక్రమ నిర్మాణానికి అధికారులు బరితెగించి సహకరిస్తున్నారు.. ఎస్ఆర్కే విల్లాల కమాన్ వద్ద ఉన్న సదరు భారీ అక్రమ నిర్మాణ అనుమతులపై, కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, టిపిఎస్ సంజునాను పలుమార్లు ప్రశ్నిచగా తెలివిగా సమాధానం చెబుతున్నారు.. భారీ మొత్తంలో ముడుపులు పుచ్చుకుని, రెసిడెన్షియల్ పర్మిషన్‌తో కమర్షియల్ కట్టడంపథ ప్రశ్నించగా..! వెనుకవైపు రోడ్డుకి మున్సిపల్ పర్మిషన్ ఇచ్చినట్లు కమిషనర్ తప్పుడు సమాధానంపై పలు అనుమానాలకు తావిస్తోంది.. నిజానికి 100 ఫీట్ల రోడ్డుకు ఇంటి పర్మిషన్ ఇచ్చిన కమిషనర్ తప్పుదోవ పట్టించే విధంగా సమాధానం అవసరం ఏముంది..? మున్సిపల్ నిబంధనలు తుంగలోతొక్కి.. 100 ఫీట్ల రోడ్డుకు కమర్షియల్ అనుమతులు ఇవ్వకుండా మున్సిపల్ ఆదాయానికి గండికొట్టి జేబులు నింపుకుంటున్నారు.. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, టౌన్‌ప్లానింగ్ అధికారిని సంజునా,హా బిల్డింగ్ వివరాలకై ఫోన్ చేసినా..! వాట్సప్‌లో మెస్సేజ్ పెట్టినా స్పందించరు..అక్రమ "సెల్లార్‌తో" పాటు ఐదంతస్తులు నిర్మిస్తున్న భవన నిర్మాణం సుమారు 800 గజాల్లో ఉంటుంది, సంబంధిత నిర్మాణానికి సుమారు 12-14 ఫీట్లవరకు చుట్టూ సెట్‌బ్యాకులు ఉండాలి..! కానీ సెట్‌బ్యాకులు లేవని, మరోవైపు రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని కమర్షియల్ కట్టడంతో 100 ఫీట్ల రోడ్డు ఎఫెక్ట్‌లో ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు..

# చదువుతో పాటు.. వ్యక్తిత్వాన్ని పెంపొందించు కోవాలి..



పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథులు..



వార్షికోత్సవం వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపి ఈటెల రాజేందర్..

- ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం వేడుకల్లో మంత్రి దుద్దిళ్ళ శ్రీదర్ బాబు..
- ఘట్‌కేసర్ మండలం ప్రతాప సింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం..
- మంత్రి శ్రీధర్ బాబు. ఎంపి ఈటల రాజేందర్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన..
- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి..



మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు..



మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్..



**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 29:** చదువుతోపాటు విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని సంపాదించు కోవాలని, విద్యార్థులకు ఐటీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఉపోద్ఘటించారు.. బుధవారం ఘట్కేసర్ మండలంలోని ప్రతాప సింగారం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవం వేడుకలకు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు. పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.. జ్యోతి ప్రజ్వలన గావించిన అనంతరం వారు మాట్లాడుతూ..! చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని అందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు వారిని వెన్నంటి ఉండి ప్రోత్సహించాలని తెలిపారు.. ఈ పోటీ ప్రపంచంలో నైపుణ్యంతో చిత్తశుద్ధి కృతనిశ్చయంతో చిన్నారులు ముందుండాలని కోరారు.. అనంతరం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ అన్ని సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తుందని వీటిని వినియోగించుకుని విద్యార్థులు రేపటి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్ది కోవాలని కోరారు.. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ ప్రజాప్రతినిధులకు జిల్లా కలెక్టర్, డీఈవో అందరికీ స్వాగతం పలికారు విద్యార్థులు చేసిన నృత్య కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి..

# గోదావరి, కృష్ణా పుష్కరాలకు అందర్నీ ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేయండి

**హైదరాబాద్ పెన్ పవర్:**రానున్న గోదావరి, కృష్ణా పుష్కరాలకు దేశవ్యాప్తంగా భక్తులను, పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నూతన టూరిజం పాలసీని ఫిబ్రవరి 10వ తేదీలోగా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా అత్యుత్తమ పాలసీని రూపొందించాలన్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమ్మక్క, సారలమ్మ జాతర సమయంలో భక్తులు, పర్యాటకులను ఆకర్షించేందుకు రెవెన్యూ, అటవీ, పర్యాటక శాఖలు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జాతర సమీపంలోని పర్యాటక ప్రాంతాలు, ఆలయాలను కలుపుతూ ఒక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని అన్నారు.ఆదిలాబాద్, వరంగల్, నాగార్జున సాగర్ వంటి ప్రాంతాలలో ఎకో టూరిజాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఇందిరా పార్క్, సంజీవయ్య పార్క్, ఎన్టీఆర్ పార్క్‌లను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. సింగపూర్ తరహా ఎకో టూరిజం విధానాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రానికి మరింత గుర్తింపు, ఆదాయం వచ్చేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సీఎం అన్నారు.

# హైదరాబాద్‌లో పన్నుల వసూలుకు.. ఏఐ టెక్నాలజీ అలెరియా




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ శివార్లలో రెండు కొత్త ఐటీ పార్కులను ఏర్పాటు చేయబోతున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. హైటెక్ సిటీ తరహాలోనే ఈ రెండు ఐటీ పార్కులను నిర్మిస్తామని తెలిపారు.


**పన్నుల వసూలుకు అలెరియా ఏఐ**

రాష్ట్ర ప్రభుత్వ పన్నుల వసూలు, ఇతర రాబడి మార్గాల్లో ఆదాయం నష్టపోకుండా చూసే 'అలెరియా ఏఐ' టెక్నాలజీ పనితీరు ఆసక్తికరంగా ఉందని శ్రీధర్‌బాబు అన్నారు. ఆఫ్ లైన్‌లో పనిచేసే ఈ టూల్ ను వివిధ శాఖలకు అనుసంధానిస్తే రాబడిలో నష్టపోతున్న 30 శాతాన్ని తిరిగి పొందవచ్చని సంస్థ ప్రతినిధులు ఆయనకు వివరించారు. ఫ్రాన్స్, యూఏఈల్లో హెడ్‌క్వార్టర్స్ ఉన్న ఈ సంస్థ టెక్నాలజీని దేశంలో మార్కెట్ చేసేందుకు ఐబీటీ ఇన్నోవేషన్స్, ఇన్నోలాజిక్ టెక్నాలజీస్ అనుమతి పొందాయి.

**ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సు పెంచే ఆలోచన లేదు**

ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సును పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తెచ్చామని, ఇప్పుడు వాటిని గ్రౌండ్ ఎలా చేయాలనే దానిపై ఫోకస్ పెట్టినట్టు తెలిపారు. మంగళవారం సెక్రటేరియెట్‌లో మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో చిట్ చాట్ చేశారు. "బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో వచ్చిన పెట్టుబడుల కంటే ఈ ఒక్క ఏడాదిలో ఎక్కువే వచ్చాయి. ఈ పెట్టుబడులను గ్రౌండ్ చేయడానికి ఇప్పటికే వర్క్ మొదలు పెట్టాం.

## మీ చిన్న ఇల్లు.. పెద్దగా కనిపించాలంటే ఈ రంగులు వాడాలి.. ఇలా డెకరేట్ చేసుకోవాలి..!




**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్ద ఇల్లు కట్టుకోవాలని ఎవరికైనా ఉంటుంది. కానీ అందరికీ అది సాధ్యపడదు. ఇంటీరియర్లో చిన్నచిన్న మార్పులు చేసి, చిన్న ఇంటినే పెద్దగా కనపడేలా చేసుకోవచ్చు. చాలా మంది చిన్న గదులకు లైట్ కలర్ సూట్ అవుతుందనే అపోహలో ఉంటారు. కలర్ కాంబినేషన్కీ కొన్ని లెక్కలుంటాయి. వాటిని బట్టే గోడలకు రంగులు వేసుకోవాలి. ఒక్కో గదినీ ఒక్కోలా పెయింట్ చేసుకోవాలి.బెడ్రూము వామ్ కలర్ను ఎంచుకోవాలి. సీలింగ్ కు పది సెంటీమీటర్ల కింద నుంచీ ఈ వామ్ కలర్స్ ను వేయాలి. ఆ వదిలేసిన ఖాళీని తెలుపురంగుతో నింపాలి. దీని వల్ల సీలింగ్ఎత్తుగా ఉన్నట్టూ, గది పొడవుగా ఉన్నట్టూ అనిపిస్తుంది.కారిడార్ గోడలకు డార్క్ కలర్స్ వాడాలి. దీంతో స్పేస్ ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తుంది. ఇంట్లో వాడుతున్న ఫర్నీచర్ కు దగ్గరగా ఉండే రంగులను వాడటం వల్ల ప్రశాంతమైన లుక్ ఉంటుంది. రూం కూడా పెద్దగా కనిపిస్తుంది. ఇంటికి ఉడ్వర్క్ చేయించేటప్పుడు కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవి గోడల రంగు కంటే కొద్దిగా డార్క్ గా ఉండేలా చూసుకోవాలి. దీని వల్ల కూడా గది పెద్దగా అనిపిస్తుంది. వీటితో పాటుగా గోడలకు అద్దాలను పెట్టడం వల్ల ఎక్కువ ఉపయోగం ఉంటుంది. దీంతో గది రెండింతలు పెద్దదిలా కనపడుతుంది.

## వీడు మనిషేనా?.. ఆడ పిల్ల పుడుతుందని.. గర్భిణిని ఇంటి నుంచి గెంటేశాడు భర్త




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆడపిల్ల పుట్టబోతుందని ఓ నీచుడు గర్భిణి అని చూడకుండా తన భార్యను ఇంటి నుంచి గెంటేశాడు ఓ భర్త. రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణం జరిగింది. అక్బర్ ఖాన్ తో హుమేరా బేగం అనే మహిళకు వివాహం అయింది. ఇప్పటికే వీళ్లకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ప్రస్తుతం హుమేరా బేగం మళ్లీ గర్భావతి. అయితే మూడోసారి కూడా ఆడ పిల్ల పుడుతుందని అర్ధరాత్రి ఇద్దరు పిల్లలతో పాటు భార్యను పుట్టింటికి గెంటేశాడు భర్త అక్బర్ ఖాన్. వివాహ సమయంలో పెట్టిన సామాన్లు సైతం అత్తారింటికి పంపించాడు. ఇద్దరు పిల్లతో రోడ్డున పడ్డ బాధితురాలు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. అత్తామామ కూడా కొడుకుకు వత్తాసు పలకడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది హుమేరా బేగం. వివాహం జరిగినప్పటి నుంచి భర్త వేధింపులకు గురి చేసినట్లు బాధితురాలి ఆవేదన వ్యక్తం చేసింది. మొదటి సారి ఆడపిల్లకు జన్మ నిచ్చిన తరువాత అదనపు కట్నం తేవాలని చిత్ర హింసలు పెట్టాడని తెలిపింది. గర్భవతి అయిన రెండు సార్లు భర్త అక్బర్ ఖాన్ తనను పుట్టింటికి పంపించాడని తెలిపింది. భర్త అక్బర్ ఖాన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది బాధితురాలు హుమేరా బేగం.

# కుంభమేళా చరిత్రలో చేదు అనుభవాలు.. 1954 తొక్కిసలాటలో 800 మంది చనిపోయారు..!




**హైదరాబాద్ పెన్ పవర్::** కుంభమేళా ప్రధానంగా నాలుగు చోట్ల జరుగుతుంది. హరిద్వార్, ప్రయాగ్ రాజ్, ఉజ్జయిన్, నాసిక్ లో జరిగే ఈ కుంభమేళాకు ఏటా కోట్లాది మంది భక్తులు తరలివస్తారు. పుణ్యస్నానాలు ఆచరించి వెనుదిరుగుతారు. ప్రయాగ్ రాజ్ లో వచ్చే కుంభమేళాకు మౌని అమావాస్య కలిసి వస్తుండటం.. ఆ రోజు అమృత స్నానం చేస్తే పాపాలన్నీ నశిస్తాయని నమ్మకం ఉండటంతో ప్రయాగ్ రాజ్ కు భారీగా తరలివెళ్తుంటారు. ఓ సారి చరిత్రను పరిశీలిస్తే ఇప్పటి వరకు ఐదు కుంభమేళాల్లో తొక్కిసలాట జరగగా.. నాలుగు ప్రయాగ్ రాజ్ లోవే కావడం గమనార్హం.

### 1954లో 800 మంది మృతి

స్వాతంత్ర్యం వచ్చాక 1954లో తొలి కుంభమేళా జరిగింది. ఫిబ్రవరి 3వ తేదీన తొక్కిసలాటలో 800 మంది ప్రాణాలు కోల్పోగా రెండు వేల మంది గాయపడ్డారు. అది కూడా మౌని అమావాస్య నాడే చోటుచేసుకొంది.

### 1986లో 200 మంది మృతి

1986 ఏప్రిల్ 14న కుంభమేళా సందర్భంగా నాటి యూపీ సీఎం వీర్‌బహదూర్ సింగ్ తనతోపాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్లమెంట్ సభ్యులను తీసుకొని హరిద్వార్‌లో స్నానాలకు వచ్చారు. ఈ సందర్భంగా రద్దీని నియంత్రించలేకపోయారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకొని 200 మంది మరణించారు.

### 2003 నాసిక్‌లో 39 మంది మృతి

2003లో కుంభమేళా సందర్భంగా మహారాష్ట్రలోని నాసిక్‌లో గోదావరి నదిలో స్నానాలు చేయడానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. నాడు జరిగిన తొక్కి సలాటలో 39 మంది మరణించారు.

### 2013లో త్రివేణి సంగమం వద్ద 42 మంది మృతి

2013లో అలహాబాద్‌లో జరిగిన కుంభమేళాలో ఫిబ్రవరి 10వ తేదీన తొక్కిసలాట చోటుచేసుకొంది. ఒక ఫుట్ బ్రిడ్జ్ కూలిపోవడమే దీనికి కారణం. ఈ ఘటనలో 42 మంది మరణించారు.

# బంగారం ధర ఒక్కరోజే ఇంత పెరిగితే ఇంకేం కొంటారు..!



**హైదరాబాద్ పెన్ పవర్:**బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. 24 క్యారెట్ల బంగారం ధరపై ఇవాళ(జనవరి 29, 2025) ఒక్కరోజే 920 రూపాయలు పెరిగింది. దీంతో.. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర 83,850 రూపాయలకు చేరుకుంది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా 10 గ్రాముల ధరపై 850 రూపాయలు పెరిగింది. మంగళవారం 75,100 రూపాయలు ఉండగా బుధవారానికి ఈ ధర 75,950 రూపాయలకు చేరుకుంది. గత పది రోజులుగా బంగారం ధరల తీరుతెన్నులను పరిశీలిస్తే.. జనవరి 20న 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర 81,230 రూపాయలుగా ఉండగా జనవరి 29న 82,850 రూపాయలకు చేరింది. అంటే పది రోజుల్లో 1,620 రూపాయలు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం పెరిగిన తీరు కూడా ఇలానే ఉంది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర జనవరి 20న 74,500 రూపాయలు ఉండగా, జనవరి 29, 2025న అంటే ఇవాళ 75,950 రూపాయలకు ఎగబాకింది. ఈ పది రోజుల్లో 22 క్యారెట్ల బంగారం ధర కూడా పది గ్రాములపై 1,450 రూపాయలు పెరగడం గమనార్హం. వెండి ధరలు కాస్తంత తగ్గుముఖం పట్టాయి. లక్ష రూపాయలకు పైగానే దూసుకుపోయిన కిలో వెండి ధర ఇవాళ(బుధవారం, జనవరి 29, 2025) 96,500కు పడిపోయింది.

2024లో పెరిగినంతలా కాకపోయినా 2025లో బంగారం ధరలు మోస్తరుగా పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. డొమెస్టిక్ మార్కెట్లో ధరలు రూ.85 వేల వరకు వెళ్తాయని, డిమాండ్ మరీ ఎక్కువైతే రూ.90 వేల మార్కుకు చేరుకుంటాయని చెప్పారు. వెండి ధర రూ.1.1 లక్షల నుంచి రూ.1.25 లక్షల వరకు దూసుకెళ్లవచ్చని వివరించారు. 2025 మొదటి ఆరు నెలలలో బంగారానికి డిమాండ్తక్కువే ఉండొచ్చనే అభిప్రాయం బులియన్ మార్కెట్ నిపుణుల్లో వ్యక్తమవుతోంది. బంగారం ధరలు వేగంగా పెరగకపోవచ్చనే వాదనలూ ఉన్నాయి.

# సూర్యాపేట పరువు హత్య కేసులో ఆరుగురు నిందితుల అరెస్ట్

- ఆరు నెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్న కృష్ణ, భార్గవి
- ప్రేమ పెళ్లి చేసుకున్నందుకు కృష్ణపై కక్ష కట్టిన భార్గవి సోదరులు
- హత్య చేసి పిల్లలమర్రి మూసీ కాల్వకట్టపై పడేసిన నిందితులు



హైదరాబాద్ పెన్ పవర్:సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన పరువు హత్య కేసులో పోలీసులు ఈరోజు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో భార్గవి ఇద్దరు సోదరులు నవీన్, వంశీ, నానమ్మ బుచ్చమ్మ, తండ్రి సైదులు ఉన్నారు. నవీన్ స్నేహితులు బైరి మహేశ్, సాయిచరణ్‌లను అరెస్ట్ చేశారు. ఆరు నెలల క్రితం వడ్లకొండ కృష్ణ, భార్గవి ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రేమ వివాహం చేసుకున్నందుకు కక్ష పెంచుకున్న సోదరులు కృష్ణను హత్య చేశారు. సోమవారం నాడు పిల్లలమర్రి కాల్వకట్టపై మృతదేహం లభ్యమైంది.కృష్ణను చంపుతామని భార్గవి సోదరుడు నవీన్ పలుమార్లు బెదిరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. కృష్ణను హత్య చేసేందుకు భార్గవి కుటుంబ సభ్యులు నలుగురితో పాటు మరో ఇద్దరు కుట్రపన్నారు. రెండు నెలలుగా కృష్ణను హత్య చేసేందుకు పథకం వేశారు. ఈ నెల 19న హత్య చేయాలని భావించినప్పటికీ అది కుదరలేదు. దీంతో ఆదివారం హత్య చేశారు. సూర్యాపేటలోని జనగామ క్రాస్ రోడ్‌లోని ఓ నిందితుడి వ్యవసాయ భూమి వద్ద ఆదివారం రాత్రి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకొని తెల్లవారుజాము వరకు కారులో తిరిగారు. చివరకు పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాల్వకట్టపై మృతదేహాన్ని వదిలేసి నిందితులు పరారయ్యారు.

## కుంభమేళా తొక్కిసలాట ఘటనపై స్పందించిన రేవంత్ రెడ్డి, హరీశ్ రావు



- భక్తుల మృతి విచారకరమన్న రేవంత్ రెడ్డి
- తెలంగాణ ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందిస్తామన్న సీఎం
- తొక్కిసలాట ఘటన కలిచివేసిందన్న హరీశ్ రావు

హైదరాబాద్ పెన్ పవర్:మహా కుంభమేళా తొక్కిసలాట ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు తదితరులు స్పందించారు. తొక్కిసలాట ఘటనలో పదిహేను మంది మృత్యువాత పడ్డారని, మరికొంతమంది గాయపడ్డారని తెలిసిందని, ఇది విచారకర విషయమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని వివరించారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద ఘటన కారణంగా మృతి చెందిన, గాయపడిన వారి కుటుంబాలను ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందిస్తామన్నారు.

**తొక్కిసలాట ఘటన కలచివేసింది: హరీశ్ రావు**

ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో తొక్కిసలాట జరిగి పదుల సంఖ్యలో భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటన కలచివేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వారిని కేంద్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. క్షతగాత్రులకు మంచి వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రయాగ్రాజ్ తొక్కిసలాట ఘటనపై సీఎం రేవంత్‌గ్భ్రాంతి

హైదరాబాద్ పెన్ పవర్: ప్రయాగ్రాజ్ మహా కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడినవారికి సరైన వైద్యం అందించాలి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

## సెస్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

హైదరాబాద్ పెన్ పవర్: సెస్ విభాగం అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సెస్ నిధుల వసూళ్ళు, వినియోగం, వంటి అంశాలపై చర్చ జరిగింది. రైతన్నలుకు నేతన్న లకు విద్యుత్ సరఫరా లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## మల్లారెడ్డి యూనివర్సిటీలో బిల్డింగ్ నుంచి కిందకు దూకే ప్రయత్నం చేసిన విద్యార్థిని...

నాలుగో అంతస్తులోని కిటికీ నుంచి కిందకు దూకే ప్రయత్నం

ఉమెన్స్ క్యాంపస్ బిల్డింగ్ నుంచి దూకే ప్రయత్నం

కాపాడిన సెక్యూరిటీ సిబ్బంది, తోటి విద్యార్థులు



హైదరాబాద్ పెన్ పవర్: మేడ్చల్ జిల్లాలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో ఓ విద్యార్థిని నాలుగో అంతస్తులో ఉన్న గది కిటికీ నుంచి కిందకు దూకే ప్రయత్నం చేసింది. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది, తోటి విద్యార్థులు ఆమెను కాపాడారు. క్యాంపస్ పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని ఒకరు ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ క్రమంలో యూనివర్సిటీలోని ఉమెన్స్ క్యాంపస్ బిల్డింగ్ పై నుంచి కిందకు దూకే ప్రయత్నం చేసింది. ఆ విద్యార్థిని పరీక్షల్లో కాపీ కొడుతూ పట్టుబడటంతో అవమానంగా భావించి ఆత్మహత్యాయత్నం చేసిందని కూడా వార్తలు వస్తున్నాయి. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## యమునా నదిపై కేజ్రీవాల్ వ్యాఖ్యల మీద కేసు నమోదు చేస్తాం

హైదరాబాద్ పెన్ పవర్:ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై హర్యానా ప్రభుత్వం కేసు నమోదు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి విపుల్ గోయల్ తెలిపారు. యమునా నదిని బీజేపీ ప్రభుత్వం విషపూరితం చేస్తోందని కేజ్రీవాల్ చేసిన నిరాధార ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.తమ ప్రభుత్వంపై కేజ్రీవాల్ చేస్తున్న తప్పుడు ఆరోపణల వల్ల హర్యానా, ఢిల్లీ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, ఆయన నిరాధార ఆరోపణలు చేస్తుంటే ఉపేక్షించేది లేదన్నారు. దీనికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేజ్రీవాల్ మాటలు అవాస్తవమని నిరూపిస్తామని వ్యాఖ్యానించారు. హర్యానాలోని అధికార బీజేపీ యమునా నదిలోకి కావాలనే పారిశ్రామిక వ్యర్థాలను వదులుతోందని కేజ్రీవాల్ నిన్న ఆరోపించారు. నదిలో విషం కలపడం ద్వారా ప్రజలను హతమార్చాలని చూస్తోందని అన్నారు. ఉద్దేశపూర్వకంగా పారిశ్రామిక వ్యర్థాలను డంప్ చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ సీఎం అతిశీ కూడా తీవ్ర విమర్శలు చేశారు. యమునను కలుషితం చేయడం 'జల ఉగ్రవాదం'గా ఆమె అభివర్ణించారు.

## వేరుశనగ రైతుల ఆందోళన కనిపించడం లేదా సీఎం రేవంత్ రెడ్డి గారు? - ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ పెన్ పవర్:అసలే దిగుబడి లేక సతమతమవుతున్న రైతుకు గిట్టుబాటు ధర కూడా రావడం లేదు. ఒకపక్క వ్యాపారుల మోసం, మరొపక్క ప్రభుత్వం శీతకన్ను వేయడం వల్ల వేరుశనగ రైతుల ఆందోళనతో మహబూబ్ నగర్ జిల్లా అట్టుడుకుతోందని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

పోలీసుల బందోబస్తు నడుమ వేరుశనగ కొనుగోలు జరపాల్సిన దుస్థితి రావడం దారుణం. రైతుల పాలిట రాబందుగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతాంగం క్షమించబోదు. కాంగ్రెస్ పాలన రైతుల పాలిట శాపంగా మారింది. తక్షణమే ప్రభుత్వం మేల్కొని వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా మార్కెట్ యార్డుల్లో వ్యాపారులు, కమిషన్ దారుల ఆగడాలను అరికట్టాలని అన్నారు.

## జర్నలిస్టుల సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు...

**హైదరాబాద్ పెన్ పవర్:** హుజురాబాద్ జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కరించకుంటే ప్రభుత్వంపై మరో ఉద్యమం తప్పదని వివిధ పార్టీ నాయకులతో పాటు ప్రజాసంఘాలు హెచ్చరించాయి. మా ఇల్లు మాకు కావాలంటూ హుజురాబాద్ జర్నలిస్టులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు బుధవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. నిరసన కార్యక్రమంలో భాగంగా ప్రెస్ క్లబ్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తూ హుజూరాబాద్ లోని ప్రధాన వీధుల గుండా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అంబెడ్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. అంబేద్కర్ కూడలిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాకారులు ఆటపాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ... గత 20 సంవత్సరాలుగా జర్నలిస్టులు ఎంతో కష్టపడి సాధించుకున్న నివేషణ స్థలాలను కాంగ్రెస్ పార్టీ అడ్డుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ తో పాటు మంత్రి పొన్న ప్రభాకర్ వెంటనే చొరవ చూపి వారికి పూర్తిస్థాయిలో ఇల్లు కట్టించాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు వారికి అండగా ఉంటామని, వారితోపాటు కలిసి నిరసనలో పాల్గొంటామని అన్నారు. జర్నలిస్టుల సమస్యపై ప్రభుత్వం కాలయాపన చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు కూడా చేపడతామని హెచ్చరించారు. జర్నలిస్టుల నిరసనకు బిఆర్ఎస్, బిజెపి వామపక్ష పార్టీలు సిపిఐ, సీపీఎం లతోపాటు ప్రజాసంఘాలు మద్దతు పలికాయి. ఈ నిరసన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కన్వీనర్ గడ్డం ధర్మారెడ్డి, కో కన్వీనర్ లు కాయిత రాములు,నిమ్మటూరి సాయి కృష్ణ ,టీయు డబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు నంబి భరణి కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షుడు మక్సుద్ ,జిల్లా నాయకులు చిలుకమారి సత్యరాజ్, వేల్పుల సునీల్ కుమార్,బొడ్డు శ్రీనివాస్ తో పాటు సీనియర్ జర్నలిస్టులు కోరం సుధాకర్ రెడ్డి, మామిడి రవీందర్, అల్లి నరేందర్, మండల యాదగిరి, కామని రవీందర్ , పిల్లల సతీష్ ,గుడూరు కొండల్ రెడ్డి,సురుకంటి తిరుపతిరెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ గందే రాధిక, బిఆర్ఎస్ నాయకుడు గందే శ్రీనివాస్, బిజెపి పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు , ప్రజాసంఘాల నాయకులు వేల్పుల రత్నం, సందుపట్ల జనార్ధన్, పొడిశెట్టి వెంకటరాజం, మార్త రవీందర్ ,విష్ణు దాస్ గోపాలరావు, బత్తుల మనోజ్ తోపాటు ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. శనిగరపు బాబ్జి కళాబృందం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

## కుంభమేళా తొక్కిసలాటలో 14 మంది మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రయాగ్రాజ్ కుంభమేళాలో తొక్కిసలాట జరిగింది. ఆ తొక్కిసలాటలో 14 మంది మృతిచెందారు. 50 మందికిపైగా గాయపడ్డారు. ప్రస్తుతం ప్రధాని మోదీ కుంభమేళాపై పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇవాళ తెల్లవారుజామున 3 గంటల సమయంలో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఆ తొక్కిసలాటలో 14 మంది మృతిచెందారు. మరో 50 మందికిపైగా గాయపడినట్లు తెలుస్తోంది. ప్రయాగ్రాజ్లోని స్వరూపరాణి ఆస్పత్రికి మృతదేహాలను తరలించారు. అక్కడ పోస్టు మార్టం నిర్వహించనున్నారు.

## రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంట పల్లి గ్రామ పరిధిలోని నరసమ్మ గుడి సమీపంలో ఉన్న తోటలో లక్ష్మీపతి రెడ్డి(45) అనే వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఆత్మహత్య కల కారణాలు తెలియాల్సి ఉంది.

# పంచాయతీల్లో బీసీలకు 42% సీట్లు ?
# అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టే చాన్స్ !



**హైదరాబాద్ పెన్ పవర్:** పంచాయతీ ఎన్నికలకు సర్కారు కసరత్తును ముమ్మరం చేసింది. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. అయితే కులగణనకు సంబంధించిన నివేదిక ఇప్పటికే పూర్తయిందని తెలుస్తోంది. ఈ లెక్కన బీసీలకు 42 శాతం సీట్లు రిజర్వ్ అయ్యే అవకాశం ఉందని సమాచారం. సమగ్ర కులగణనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయిలో తెలంగాణ నిర్వహించిన సమగ్ర కులగణన సర్వే ప్రశంసలందుకుందని సీఎం చెప్పారు. సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు.
సర్వేకు సంబంధించిన ముసాయిదా నివేదిక సిద్ధమైందని, ఫిబ్రవరి 2వ తేదీ నాటికి కేబినెట్ సబ్ కమిటీకి సమర్పిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమావేశానికి రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**ఫిబ్రవరిలో ఎన్నికలు**

ఫిబ్రవరి 2 తరువాత ఇప్పటికే పంచాయితీల్లో గతేడాది 2024, ఫిబ్రవరి1న సర్పంచ్ పదవీకాలం ముగియగా.. ప్రత్యేక అధికార పాలన వచ్చింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే 15 రోజుల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధంగా ఉంది. ఈ మేరకు ఓటర్ల జాబితాలను సైతం సిద్ధం చేసిన విషయం తెలిసిందే. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్నాయి. దీంతో పల్లెలకు కేంద్రం నుంచి గ్రాంట్లు రావడం లేదు. త్వరగా ఎలక్షన్లు నిర్వహిస్తే కేంద్రం నిధులు వస్తాయి. ఫిబ్రవరి 2న కేబినెట్ సబ్ కమిటీకి రిపోర్టు అందితే.. ఆ నివేదికపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై దానిని ఆమోదిస్తుంది. తర్వాత బీసీ గణన కు సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఎలాంటి అడ్డంకులు రాకుండా ఉండేందుకు న్యాయనిపుణులతో రివ్యూ చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రకియను ఫిబ్రవరి రెండో వారంలోగా నిర్వహించాలని నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది.

# భార్యను కుక్కర్‌లో ఉడికించిన గురుమూర్తికి
# చివరకు ఏ గతి పట్టిందో చూడండి..





**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మీర్‌పేట్ మర్డర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. భార్యను అత్యంత కిరాతకంగా హత్య చేసిన నిందితుడు గురుమూర్తిని మీర్‌పేట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు పూర్తి చేసి ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. గురుమూర్తికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు రిమాండ్ విధించిన అనంతరం నిందితుడు గురుమూర్తిని పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు.రంగారెడ్డి జిల్లా రాచకొండ కమిషనరేట్ మీర్ పేట్ పరిధిలో దారుణం జరిగిన సంగతి తెలిసిందే. గురుమూర్తి అనే వ్యక్తి తన భార్యను చంపి ముక్కలు ముక్కలుగా నరికి కుక్కర్‌లో వేసి ఉడికించాడు. తర్వాత వాటిని తీసుకువెళ్లి సమీపంలోని డ్రైనేజీలో పడేశాడు. బొక్కలను కాల్చి పొడి చేసి చెరువులో కలిపాడు. జనవరి16న ఘటన జరగ్గా ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఉప్పల సుబ్బమ్మ, వెంకటరమణ భార్యాభర్తలు. వీరికి ముగ్గురు బిడ్డలు. పెద్ద కుమార్తె వెంకటమాధవి(35)ని13 ఏండ్ల కింద అదే జిల్లాకు చెందిన గురుమూర్తికి ఇచ్చి పెండ్లి జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు. గురుమూర్తి ఆర్మీలో జవాన్‌గా పని చేసి వాలంటరీ రిటైర్మెంట్‌తీసుకున్నాడు. తర్వాత కంచన్‌బాగ్ డీఆర్డీవోలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ మీర్ పేట్ పీఎస్‌పరిధి జిల్లెలగూడలోని న్యూ వెంకటేశ్వర కాలనీలో ఉంటున్నాడు.

కొన్నాళ్ల నుంచి గురుమూర్తి తన భార్య వెంకటమాధవిపై అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో భార్యాభర్తలకు తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో ఈ నెల16వ తేదీన భార్యతో గొడవపడిన గురుమూర్తి.. తర్వాత తన భార్య కనిపించడం లేదని అత్తమామలకు సమాచారం ఇచ్చాడు. తనతో గొడవ పడి భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఒక్కడే వెళ్లి మీర్ పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు ఇంటి ఎదురుగా, పక్కన ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు.అందులో 16వ తేదీన గాని, ఆ తర్వాత గాని.. వెంకటమాధవి ఎక్కడా బయటకు వెళ్లినట్టుగాని, లోపలకు వచ్చినట్టు గాని కనిపించలేదు. పలుమార్లు గురుమూర్తి కొన్ని కవర్లతో బయటకు వెళ్లి రావడాన్ని గుర్తించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. తర్వాత వెంకటమాధవి అత్తతో ఫిర్యాదు తీసుకుని సీసీటీవీ పుటేజీల గురించి గురుమూర్తికి చెప్పి ప్రశ్నించారు. ఇక కేసు నుంచి బయటపడలేనని అర్థమైన గురుమూర్తి..తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు.

## చదువుకు సహకారం చిరస్మరణీయం

**జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్**



**హైదరాబాద్ పెన్ పవర్:** దేవుడు మనకిచ్చిన దాన్ని సాటి మానవులకు సహాయం చేయడం వల్ల కలిగే మానసిక ఆనందం అనంతమైనదని జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని బూడిదగడ్డలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి నెల రోజులకు సరిపడా బిస్కెట్లు పండ్లు అల్పాహారంగా గౌరి శంకర్ వారి కుటుంబ సభ్యులు సహకారంతో బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో మంచి చెడుల విచక్షణ చూపే విద్యా దానం మిన్న అని పేర్కొన్నారు. సమాజంలోని పెద్దలు పేద విద్యార్థుల చదువుకు సహకరించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మధురవాణి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందచేసి వారి చదువుకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో దాతలు భరత్ సందీప్ కాంతి రేఖ ఉపాధ్యాయులు దస్తగిరి బాలు తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ డిఎం విజయవంతం



**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్తగూడెం ఇల్లందు పట్టణాలకు చెందిన ఆర్టీసీ ప్రయాణికుల సలహాలు సూచనలను తెలుసుకునేందుకు బుధవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా డయల్ యువర్ డిఎం ఫోన్ ఇన్ ప్రోగ్రామ్ కు ప్రయాణికులు తమ సమస్యలు సూచనలు సలహాలు తెలియజేయడం జరిగింది. ఇల్లందు నుండి మాణిక్యారంకు బస్సు కావాలని ఇల్లందు నుండి గుండాల నుండి శెట్టుపల్లికి బస్సును నడిపించాలని కోరడం జరిగిందన్నారు. కొత్తగూడెం నుండి ఖమ్మం వైపు వెళ్లే పల్లెవెలుగు సర్వీస్ ను పడమటి నర్సాపురంలో హాస్టల్ దగ్గర బస్సు ఆపాలని ఖమ్మం నుండి లేదా ఇల్లందు నుండి ఎస్ ఎఫ్ ఎస్ స్కూల్ బల్లేపల్లి దగ్గర బస్సు ఆపాలని కోరినట్లుగా పేర్కొన్నారు. ఖమ్మం నుండి వయా ఇల్లందు కొత్తగూడెం మీదుగా మణుగూరుకు బస్సు కావాలని భద్రాచలం మణుగూరు నుండి వచ్చే కొత్తగూడెం కలెక్టర్ ఆఫీస్ దగ్గర బస్సులు ఆపాలని కొత్తగూడెం నుండి సాయంత్రం 5.30 నిమిషాల తర్వాత బస్సు ఖమ్మంకు పల్లెవెలుగు కావాలని ఇల్లందు నుండి ఖమ్మంకు ఎక్స్‌ప్రెస్ సర్వీస్ శాంతినగర్ దగ్గర రిక్వెస్ట్ గా ఆపాలని కోరినట్లుగా వివరించారు. తదితర సమస్యలను తమ దృష్టికి తీసుకురాగా వినతులను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని విద్యార్థులు చేసిన వారికి తెలియజేయడం జరిగిందని డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ వివరించారు.

## గ్రాండ్ టెస్ట్ గోడపత్రికను ఆవిష్కరించిన చింతకుంట్ల లక్ష్మారెడ్డి.



**హైదరాబాద్ పెన్ పవర్:** కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో... ఈనెల 30వ తారీఖున గురువారం ఉదయం 9:30 లకు కోదాడ ఎమ్మెస్ కాలేజీ నందు నిర్వహించే గ్రాండ్ టెస్ట్ గోడపత్రికను టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులలో ఉన్న మేద శక్తిని వారి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు ఇలాంటి గ్రాండ్ టెస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అంతేకాకుండా పదవ తరగతి ఫైనల్ పరీక్షలకి వెళ్ళే విద్యార్థులకు ఇలాంటి గ్రాండ్ టెస్ట్ లు ఒక ధైర్యాన్నీ ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు, ప్రధాన కార్యదర్శి గంధం వెంకటనారాయణ, తోటపల్లి నాగరాజు, పవన్ కుమార్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

# సౌకర్యాలపై విజ్ఞప్తులు



**హైదరాబాద్ పెన్ పవర్:** సింగరేణి కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగుల కార్మికుల సౌకర్యాలపై బుధవారం సింగరేణి కార్పొరేట్ కార్యాలయము నందు నిర్మాణాత్మక స్ట్రక్చర్ సమావేశం జరిగింది.

సింగరేణి సంస్థ కార్పొరేట్ ఏరియా పరిధిలోని వివిధ డిపార్ట్మెంట్లకు సంబంధించిన సమస్యల గురించి జనరల్ మేనేజర్(ఐఆర్ అండ్ పిఎం) కవితా నాయుడు అధ్యక్షతన గుర్తింపు కార్మిక సంఘం(ఏఐటియూసి)నాయకులతో నిర్మాణాత్మక స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈ క్రింది అంశాలపై చర్చించారు. కొత్తగూడెం మెయిన్ ఆసుపత్రి లోని క్యాజువాలిటీ నందు ఈసిజి మానిటర్ ప్రతి వార్డులో స్టాఫ్ నర్సుల కొరకు వాష్ రూమ్‌లు ఏసి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. భద్రతా సిబ్బందికి నాణ్యమైన యూనిఫాం క్లాత్ షూలు రెయిన్ కోట్‌లు తాగునీటి సౌకర్యం సరఫరా చేయాలని పేర్కొన్నారు. సెంట్రల్ వర్క్‌షాప్ సెంట్రల్ ఆటో వర్క్‌షాప్ మెయిన్ హాస్పిటల్ సెక్యూరిటీ పోస్టుల వద్ద లైటింగ్ ఫ్యాన్లు కుర్చీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎక్స్ప్లోరేషన్ శాఖలో కొత్తగా నిర్మించిన షెడ్లలో ఫ్యాన్లు లైటింగ్ సౌకర్యాన్ని అందించడం ఎక్స్ప్లోరేషన్ సిబ్బందికి వాషింగ్ అలవెన్స్ చెల్లించాలన్నారు.

కొత్తగూడెం రైటర్స్ బస్తీ లో కొత్తగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ నందు కిచెన్ డైనింగ్ షెడ్ ఏర్పాటు చేయాలని ప్రింటింగ్ ప్రెస్‌ను బలోపేతం చేయడం కొరకు మ్యాన్ పవర్ తో పాటు అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మెయిన్ వర్క్‌షాప్ సెంట్రల్ వర్క్‌షాప్‌లో పూర్తి స్థాయి లో ఛార్జ్‌హ్యాండ్‌లను(మెకానికల్ ఎలక్ట్రికల్) పోస్ట్

కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ వ్యక్తిగత పనులపై పై వచ్చే ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగులు ఉండుటకు వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఎగ్జిక్యూటివ్‌లతో సమానంగా

ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగులకు పెట్రోల్ డీజిల్ కోటాను పెంచాలన్నారు. వైద్యుల సిఫార్సుతో సంబంధం లేకుండా కార్మికుల అవసరాలకు అనుగుణంగా వర్క్‌మెన్ క్వార్టర్స్‌లో వెస్టన్ కమోడ్‌లను ఏర్పాటు చేయాలని సివిల్ డిపార్ట్మెంట్ పని సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి సివిల్ సివిక్ పనుల వద్ద తగినంత సుపర్వైసర్ సిబ్బందిని నియమించాలని బాబు

క్యాంప్ బర్మా క్యాంప్ మెయిన్ హాస్పిటల్ ఏరియా రైటర్స్ బస్తీ కార్మికుల కాలనీలలో కోతుల బెడద నిర్మూలించటానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పైన పేర్కొన్న పది అంశాలపై సుధీర్ఘముగా సమీక్షించి సంస్థ పరిధిలో ఉన్న మేరకు వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని జనరల్ మేనేజర్(ఐఆర్ అండ్ పిఎం) కవితా నాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్(ఐఆర్ అండ్ పిఎం)కవితా నాయుడు, గుర్తింపు సంఘం(ఏఐటియూసి)సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్, బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌వి.రమణ మూర్తి, జిఎం(డబల్యూఎస్ అండ్ ఈఎం) ఫిజరాల్డ్ జేసురత్నం, సిఎంఓ పి.సుజాత, ఏజిఎం(ఐఈ) బొజ్జ రవి, ఏజిఎం(మెయిన్ వర్క్ షాప్) పి.రాజీవ్ కుమార్, డిజిఎం(పర్సనల్)ఐఆర్ వింగ్ కే.అజయ్ కుమార్, డిజిఎం(పర్సనల్) బి.రాజ గోపాల్, డిజిఎం(సివిల్) పి.రాజ శేఖర్, డిజిఎం(స్టోర్స్)వి.రామ కృష్ణ, డిజిఎం(పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, ఎస్ఈ(ఐఈ)వై.శంకర్ రెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సైన్, ఏఐటియూసి కార్పొరేట్ ఏరియా ఆసిస్టంట్ బ్రాంచ్ సెక్రెటరీ రాము, ఇతర సంబంధిత డిపార్ట్మెంట్ల అధికారులు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.